క్లుప్తంగా

ఆంజనేయస్వామికి పూజలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని గాంధ్లవీధిలోని ఆంజనేయస్వామి ఆలయం, ఇరిగేషన్ కార్యాలయం, టోల్‌గేట్ వద్దనున్న ఆంజనేయ స్వామి ఆలయాలలో మంగళవారం భక్తులు ఘనంగా పూజలు చేశారు. ఉదయం నుంచే మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే భక్తులందరూ సహస్త్రనామాలతో అంజన్నకు ఆకుపూజ జరిపారు.

మే 3 నుంచి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

సిద్దవటం: మండల శివారులోని జీఎంజీ కళాశాలకు ఎదురుగా వెలసిన శ్రీ పెంచల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో స్వామి బ్రహ్మోత్సవాలు మే 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన కార్యదర్శి పాలెం చిన్న సుబ్బరాయుడు తెలిపారు. 5వ తేదీన ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం చేయనున్నట్టు పేర్కొన్నారు. రాత్రి స్వామి వారికి పవళింపు సేవ కార్యక్రమం జరుగునన్నారు. భక్తులు విరివిగా పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని భక్తాంజనేయస్వామి దేవస్థానంలో జగద్గురు ఆదిశంకరాచార్యుల వారి జయంతిని మంగళవారం బ్రాహ్మణ సంఘం ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించినారు. స్వాములవారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వచ్చే ఏడాది శంకర జయంతి నాటికి శంకర మఠం పనులు పూర్తి చేసి ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చిందుకూరి నరసింహశర్మ, సూరేష్‌కుమార్, పిడతల రామ్మోహన్, ప్రసాద్‌రావు, రామచంద్రయ్య, కోసంగి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన భీష్మ ప్రతిజ్ఞ

రామాపురం : మండల కేంద్రంలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న మహాభారత యజ్ఞం ప్రజలను అలరిస్తోంది. ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి తరలివస్తున్నారు. మంగళవారం కర్ణపు రామ్మోహన్‌రెడ్డి సోదరులు రామచంద్రారెడ్డి, రాజారెడ్డిలు అన్నదానం ఏర్పాటు చేశారు. మహాభారత యజ్ఞాన్ని సీతామహాలక్ష్మి హరికథ రూపంలో చెబుతుండగా రాత్రి సమయంలో లక్కిరెడ్డిపల్లె శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి మహాభారత యజ్ఞాన్ని వేషాల రూపంలో కన్నులకు కట్టినట్టు చూపుతున్నారు. భీష్మ విజయం కథను ప్రజలకు కనువిందు చేసే విధంగా చెప్పారు.

అన్నదానం

రామాపురం : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో వరిగపాపిరెడ్డిగారిపల్లెకు చెందిన దండూరి లక్ష్మీదేవి, సహదేవరెడ్డి దంపతుల వివాహం సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని బండపల్లె ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టినట్లు క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ తెలిపారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు అంజలి, సితాన్‌రెడ్డి, బసిరెడ్డి, గురుశంకర్‌రెడ్డి, వృద్ధాశ్రమం మేనేజర్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గాలివీడు : గాలివీడు సబ్ స్టేషన్ పరిధిలో నేడు, రేపు ఉదయం నుంచి సాయంత్రం వరకు సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ నరేంద్రరెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

బాధ్యత మరింత పెంచింది



సర్పంచ్ మమత దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్ : ఉత్తమ సర్పంచ్ అవార్డు తమ బాధ్యత మరింత పెంచిందని చెన్నముక్కపల్లె సర్పంచ్ మమత అన్నారు. మంగళవారం రాయచోటి రూరల్ పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికైన మమతను సాయంత్రం విధుల విరామ సమయంలో సన్మాన సభను ఏర్పాటు చేశారు. గ్రామ పంచాయతీ అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్‌రెడ్డి, ఏపీబీసీ డైరెక్టర్ రాయవరం శ్రీనివాసరెడ్డి, రాయచోటి జెడ్పీటీసీ వెంకటేశ్వర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

చిన్నమండెం : టమాటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్‌లు కోరారు. మంగళవారం మండల పరిధిలోని కేశాపురం గ్రామంలో టమాట పంటను ఏపీ రైతు సంఘం, సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేల రూపాయలు ఖర్చు చేసిన టమాట పంటకు ధరల్లేక రైతులు పొలాల్లోనే పంటను వదిలేసే పరిస్థితి నెలకొందని, అధికారులు, ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

గంగమ్మ జాతరకు ముస్తాబైన కోడూరు

- నేటి నుంచి మూడు రోజులపాటు జరుగనున్న జాతర
- భక్తుల రద్దీ దృష్ట్యా ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ, పోలీసులు
- ఆకట్టుకుంటున్న దేవర దున్నపోతు ఊరేగింపు



దున్నపోతును ఊరేగిస్తున్న నిర్వాహకులు, కోడూరువాసులు



అలంకరణలో కోడూరు గంగమ్మ (ఫైల్)

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు గంగమ్మ భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. పట్టణంలోని పాతబజారువీధిలో మిట్టవద్ద వెలసిన గంగమ్మకు ప్రతి ఏడాది వైభవంగా జాతర నిర్వహిస్తారు. 80 సంవత్సరాలకు పైబడ్డ చరిత్ర కలిగిన ఇక్కడి జాతరకు చుట్టు పక్కల జిల్లాల నుంచి ప్రజలు వేలాదిగా వస్తుంటారు. 1930 సంవత్సరం నుంచి కోడూరు గంగమ్మకు నిర్వాహకులు ప్రతి ఏడాది వైభవంగా జాతర నిర్వహిస్తున్నారు. 26, 27, 28 తేదీలలో పట్టణమంతా ప్రత్యేక అంగళ్లు, రంగులరాట్నాలు, జనాలతో కిటకిటలాడుతుంది. పాత బజారులో చలువ పందిళ్లతో అలంకరించారు. బుధవారం సాయంత్రం నుంచి స్థానిక అంకాలమ్మ గుడిలో కుమ్మరులు భక్తిశ్రద్ధలతో గంగమ్మను తయారుచేసి, బుర్రకథ, ప్రత్యేక పూజలతో రాత్రంతా గంగమ్మకు మొక్కులు తీర్చుకొని గురువారం తెల్లవారుజామున అంకాలమ్మగుడి నుంచి వేలాది మంది భక్తుల నడుమ అట్టహాసంగా పల్లకీలో ఊరేగింపుగా గంగమ్మమిట్టకు తరలిస్తారు. వేడుకను చూడడానికి ఇసుక వేస్తే రాలనంతగా జనం హాజరవుతుంటారు. ఈ అంకంతో జాతర ప్రారంభమవుతుంది. ఉదయం నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉండటంతో పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఘట్టం కుండకు ప్రత్యేక స్థానం

కోడూరు జాతరలో ఘట్టం కుండకు ప్రత్యేకస్థానం ఉంది. జాతర చాటింపు జరిగిన నాటి నుంచి ఘట్టం కుండతో భక్తులు దేవర దున్నపోతును అలంకరించి కోడూరు పొలిమేర లోపల ఉన్న ప్రతివీధికి, ప్రతి ఇంటికి తిరుగుతారు. భక్తులు ఇంటి వద్దకు వచ్చిన ఘట్టం కుండకు, దున్నపోతుకు ప్రత్యేక పూజలు చేస్తారు. జాతర ఘట్టం ప్రారంభమయ్యేలోగా అన్ని వీధులు తిరిగి యథా స్థానానికి చేరుకుంటారు. ప్రజలు ఘట్టం కుండకు ఎంతో ప్రాధాన్యత ఇస్తారు.

ప్రభుత్వ విప్ కొరముట్లకు ఆహ్వానం

పట్టణంలో నేటి నుంచి జరిగే కోడూరు గంగమ్మ జాతరకు ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులును జాతర ఆహ్వాన కమిటీ వారు మంగళవారం ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ఎంతో ప్రాశస్త్యం కలిగిన గంగమ్మ జాతర భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న కమిటీకి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, హేమనవర్మ, సీడీ నాగేంద్ర, కొరెడ్డి సిద్దయ్య, పోకల సుబ్బరాయుడు, హేమరాజ్, పోతురాజు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలనతో మరింత పట్టు

వ్యవసాయ విద్యార్థుల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన



విద్యార్థుల ప్రదర్శనను పరిశీలిస్తున్న అధికారులు

ఒంటిమిట్ట : క్షేత్ర స్థాయి పరిశీలనతో వ్యవసాయంపై మరింత పట్టు సాధించవచ్చని మహానంది వ్యవసాయ కళాశాల, అసోసియేట్ డీన్ డాక్టర్ కె. శివశంకర్ నాయక్, ఏరువాక కేంద్రం కో - ఆర్డినేటర్ డాక్టర్ టి. మురళీకృష్ణ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని రాచపల్లి గ్రామంలో మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు అడవి పందుల నేల కోత, సమీకృత వ్యవసాయ పద్ధతులు, వివిధ మల్చింగ్ పద్ధతులు, మొదలగు మోడల్స్‌ను, వ్యవసాయ పంటల్లో సమస్యలకు తీసుకోవాల్సిన సలహాలు, సూచనలను సంబంధిత చార్టులు, పోస్టర్లు ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం 2022 – 23 కింద వ్యవసాయ కళాశాల, మహానంది నుంచి 14 మంది విద్యార్థులు ఏరువాక కేంద్రం, ఊటుకూరుకు అనుసంధానించారన్నారు. జనవరి 2022 నుంచి ఈ విద్యార్థులు ఒంటిమిట్ట మండలంలోని రాచపల్లి, మలకాటిపల్లి, ఒంటిమిట్ట గ్రామాలలో 3 నెలల పాటు నివాసం ఉండి వారి నివాస గ్రామాలలో రైతులతో కలిసి వ్యవసాయం, అనుబంధ రంగాల కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొని అనుభవం పొందారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎల్.విజయభాస్కర్, కీటక విభాగం ప్రొఫెసర్, అసోసియేట్ డీన్ రెప్రజెంటేటివ్ డాక్టర్ ఎం.ఎస్.రాహుల్, మహానంది వ్యవసాయ కళాశాల విస్తరణ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్. రామలక్ష్మిదేవి, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ సి. ప్రత్యూష, రాచగుడిపల్లి, గంగపేరూరు, పెన్నపేరూరు వీఏఏ, వీహెచ్ఏలు, ఆదర్శ రైతులు పాల్గొన్నారు.

త్వరలోనే ఉపాధ్యాయుల బదిలీలు



ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డితో డీఈఓ పురుషోత్తం, ఉపాధ్యాయులు

రాయచోటి : ఉపాధ్యాయుల స్పాట్ వేల్యూషన్ రెమ్యునరేషన్‌ను పెంచినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాయచోటిలో జరుగుతున్న ఎస్ఎస్‌సీ (పదోతరగతి) మూల్యాంకన కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆయన్ను సత్కరించి స్వాగతం పలికారు. పదోతరగతి పరీక్ష జవాబు పత్రాలను మూల్యాంకనం చేసేందుకు వచ్చే సిబ్బందికి వేసవి కారణంగా అసౌకర్యం లేకుండా తీసుకున్న చర్యలను, వసతులను ఎమ్మెల్సీ పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘనేతలు వారి సమస్యలకు సంబంధించి వినతిపత్రాలు అందించారు. తన గెలుపునకు సహకరించిన ఉపాధ్యాయులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. త్వరలోనే ఉపాధ్యాయుల బదిలీలుంటాయన్నారు. డీఏ విడుదల చేస్తారని, త్వరలో మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకం జరుగుతుందన్నారు. గ్రూప్ – 1, గ్రూప్ – 2 పోస్టుల నియామకంపై ప్రభుత్వానికి విన్నవించామన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ కొండూరు శ్రీనివాసరాజు, జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి, వివిధ సంఘాల ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరించండి

- అధికారులకు ఎమ్మెల్యే గడికోట ఆదేశం
- శెట్టిపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న శ్రీకాంత్‌రెడ్డి



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : బడుగు, బలహీన వర్గాల హృదయాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గాండ్లపల్లె, చిన్నజంగంపల్లె, బండకాడ హరిజనవాడ, నరసారెడ్డిగారిపల్లె, ఒట్టింల్లుబిడికి, కొత్తపల్లె బిడికి, బలిజపల్లె బుర్రవాండ్లపల్లె, తాటికుంట హరిజనవాడ, నాగిరెడ్డిగారిపల్లె, మెర్రంవడ్డిపల్లె, రఘుపతి ఇండ్లు, గాలివీటి ఇండ్లులలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి గడప గడపకు కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి గడపకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి వెళ్లి సమస్యలపై ఆరా తీయడంతో పాటు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను తెలియజేశారు. మరింత మెరుగైన పాలన అందించేందుకు, ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని సత్వర పరిష్కారానికి అక్కడే అధికారులను ఆదేశించారు. గాండ్లపల్లెలో రూ.5లక్షల వ్యయంతో డ్రైనేజీ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. బండకాడమాలపల్లెలో శ్మశానవాటికకు స్థల సమస్య లేకుండా చూడాలని తహసీల్దార్ మహేశ్వరీబాయ్‌కి శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. ఒంటిల్లు బిడికి వద్ద కల్వర్ట్ నిర్మాణాలను చేపడతామని పేర్కొన్నారు. బలిజపల్లెలో తాగునీటి పైపులైన్, వీధిలైట్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఉపాధి కూలీలపై ఆరా తీశారు.

బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాసులు కాదు

బీసీలంటే బ్యాక్‌బోన్ క్యాస్ట్ అని బీసీలంటే వెనుకబడిన వర్గాలు కాదని, వెన్నెముక అని సీఎం జగన్ నిరూపించారని గడికోట గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంత్రి వర్గంతోపాటు రాజ్యసభ ఎంపీ, ఎమ్మెల్సీలు నామినేటడ్ పదవుల్లోనూ ఎక్కువ శాతం బీసీలున్నారని తెలిపారు. బీసీలకు పదవుల్లో అగ్రతాంబులం ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, మల్లికార్జునరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి, ఎస్టీ నాయకుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం



వాహనం టాపుపై ప్రయాణం చేస్తున్న కూలీలు

రైల్వేకోడూరు రూరల్ : రైల్వేకోడూరు మండలంలోని కూలీలు నిరంతరం లగేజీ వాహనాల్లో ప్రమాదకరంగానే ప్రయాణం సాగిస్తున్నారు. రైల్వేకోడూరులో వలస కూలీలు ఎక్కువగా ఉన్నారు. వీరు ఉదయం ఒక వాహనంలో పనులకు వెళ్లి పూర్తి చేసుకుని తిరిగి అదే వాహనంలో వస్తూ ఉంటారు. అలా వెళ్లే కూలీలు ఎక్కువ మంది వాహనాల్లో ప్రమాదకరంగా ప్రయాణం సాగిస్తున్నారు. లగేజీ వాహనాల్లో వెళ్లే కూలీలు కొంత మంది యువకులు లగేజీ వాహనం టాపుపై వెనుక ఉన్న పైపుపై కూర్చొని, నిలబడి ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. ఎటువంటి ప్రమాదం జరుగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

రాయచోటి అర్బన్ : కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారిని వెంటనే క్రమబద్ధీకరించాలని ఏపీ అమరావతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహకుమార్, మల్లికార్జునలు డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సమానపనికి సమానవేతనం ఇవ్వాలన్నారు. ఉద్యోగులకు సంబంధించిన జీపీఎస్, ఇతర బకాయిలు వారి అకౌంట్లలోకి కాకుండా ఎక్కడకు వెళ్లాయో తెలపాలంటూ కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్, ఏఐటీయూసీ నేతలు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



గట్టుమీదపల్లిలో గ్రామోత్సవ దృశ్యం

చిట్వేలి : తిమ్మాయిపాలెం పంచాయతీ గట్టుమీదపల్లి గ్రామంలో కనుల పండువగా కోదండరాముడి గ్రామోత్సవాన్ని జరిపారు. ఈ మేరకు మంగళవారం ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ తుపాకుల బాలనరసింహులు, తుపాకుల సుబ్బరాయుడు, పెంచలయ్య, గణపతి, ఆదినారాయణ, శ్రీను, పెంచలయ్య, నరసింహులు, కోనేటి నరసింహులు, గంగయ్య, శ్రీను పాల్గొన్నారు.

పార్కుల ఏర్పాటుకు స్థలాల పరిశీలన

రాయచోటి అర్బన్ : జిల్లా కేంద్రంలో వివిధ ప్రాంతాలలో పార్కుల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను మంగళవారం మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్‌బాషా, కమిషనర్ గంగా ప్రసాద్‌లు పరిశీలించారు. ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిలు పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించే పార్కుల ఏర్పాటుకు తగుచర్యలు తీసుకోవాలంటూ ఆదేశించారు. ఇందుకు స్పందించిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లు మదనపల్లె రోడ్డు, సుద్దలవాండ్లపల్లె రోడ్డు, గున్నికుంట్ల రోడ్డులలోని ప్రభుత్వ స్థలాలను పార్కుల నిర్మాణం కోసం పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, సర్వేయర్ రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణ పవిత్రమైన బాధ్యత



నియామక పత్రం అందిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : గ్రామాలలోని అంగన్వాడీ సెంటర్లలో పనిచేసే కార్యకర్తలు, హెల్పర్లు మాతాశిశు సంరక్షణ ఒక పవిత్రమైన బాధ్యతగా భావించి విధులు నిర్వహించాలని మంగళవారం ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక సభా భవనంలో నూతనంగా నియమించబడిన అంగన్‌వాడీ వర్కర్, 6 మంది హెల్పర్లకు నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, జెట్పీటీసీ రత్నమ్మ, మార్కెట్ చైర్మన్ సుబ్బరామరాజు, సీడీ నాగేంద్ర, అధికారులు పాల్గొన్నారు.

వీవీ కండ్రిక సర్పంచ్‌కు సన్మానం

రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఆదర్శ పంచాయతీగా ఎన్నికైన వీవీ కండ్రిక సర్పంచ్ శ్రీరాం వినోద్‌ను ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విప్ కొరముట్ల మాట్లాడుతూ శ్రీరాం వినోద్‌ను ప్రతి సర్పంచ్ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గ్రామాలలో సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు, ప్రజా సమస్యలపై దృష్టిపెట్టి పరిష్కరించాలని తెలిపారు.

మా భవిష్యత్తు నువ్వే జగన్.. ఒక ప్రభంజనం

పారదర్శకతతో పథకాలు అందిస్తుండటంతో మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమం ఒక ప్రభంజనంగా సాగుతోందని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమం 1కోటి 60 లక్షల కుటుంబాలకు చేరడంతో స్థానిక పార్టీ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేసి నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడి భవిష్యత్‌కు భరోసా ఉండాలంటే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన ఉండాలని ప్రజలు కోరుకుంటున్నట్టు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 49 వేల కుటుంబాలను కలిశామన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా జగనన్నకు మద్దతు తెలుపుతూ మా భవిష్యత్తు నువ్వే జగన్ అని పేదలు, మహిళలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. దీంతో ప్రతిపక్షాలకు నిద్రలేకుండా పోయిందని పేర్కొన్నారు. ఎల్లో మీడియా ఎన్ని కుట్రలు, అబద్ధాలు ప్రచారం చేసినా ప్రజల మనసులు మార్చలేరని తెలిపారు.

పేద దళితులకు భూములివ్వండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : మండలంలోని అర్హులైన పేద దళిత కుటుంబాలకు జెడ్‌హెచ్‌డీసీ భూములు పంపిణీ చేయాలని సీపీఐ నాయకులు మంగళవారం తహసీల్దార్ పీర్ మున్నికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నఓరంపాడు, చిన్నంపల్లె గ్రామాలలో సర్వే నెంబర్ 2730, 2873లో దాదాపు 800 ఎకరాల్లో జెడ్‌హెచ్‌డీసీ భూములున్నాయని అందులో ఇతర ప్రాంతల వారు దాదాపు 60 ఎకరాల్లో కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. జెడ్‌హెడ్‌డీసీ భూములమ్ముట, కోనడం నిషేధమని అయిన ఇతర రాష్ట్రాల వారికి భూములు ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి కబ్జాలను తొలగించాలని మండలంలోని పేద దళితులకు వ్యవసాయ భూములివ్వాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చింతలపూరి నాగమ్మ, డీహెచ్‌పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దార్ల నాగేశ్వరావు, సీపీఐ నాయకులు తిరుమలయ్య, ఎం.రోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యంతో
సామాజిక తనిఖీ చేపట్టండి

ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో ఆర్‌పీ అహమ్మద్ బాషా



శిక్షణా కార్యక్రమానికి హాజరైన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

ఓబులవారిపల్లె : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీ ఈ నెల 29లోపు నిర్వహించాలని మండల విద్యాధికారిణి పద్మజ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఒక్కరోజు శిక్షణా కార్యక్రమన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షకులు ఆర్‌పీ అహమ్మద్‌బాషా మాట్లాడుతూ తల్లిదండ్రుల కమిటీ, ఉపాధ్యాయులు, విద్యార్థులందరి భాగస్వామ్యంతో సామాజిక తనిఖీ నిర్వహించాలన్నారు. ఇందులో పాఠశాల భౌతిక వనరులు, పరిసరాల పరిశుభ్రత, తరగతి గదులు, ఫర్నీచర్, తాగునీరు విద్యుత్, ఫైర్ సేఫ్టీ సౌకర్యములు, పాఠశాల పరిసరాల్లో బాలికల రక్షణ, బాల్య వివాహాల నిషేధం తదితరాలకు కమిటీలను ఏర్పటు చేయాలని సూచించారు. వసతి గృహాల్లో అందించు భోజనం, జగనన్న విద్యా కానుక, ప్రయోజశాల, బోధన అభ్యాసనా సామగ్రి, ఉపాధ్యాయులకు వృత్యాంతర శిక్షణ ,ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు అందించే సౌకర్యములు, లింగ వివక్ష లేకుండా తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయులు సామాజిక తనిఖీ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : మండలంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఎంఈఓ రంగనాథయ్య, ప్రధానోపాధ్యాయుడు నరసారెడ్డిల ఆధ్వర్యంలో పాఠశాలలో అందిస్తున్న పథకాలపై సామాజిక సర్వేలో తీసుకోవాల్సిన అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాఠశాలలో మౌలిక వసతులు, పాఠశాల పరిశుభ్రత, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, పాఠశాల వసతి, విద్యార్థులకు అందించే భోజనం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. అనంతరం వారు ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెనగలూరు శాస్త్రవేత్తకు ఉగాది పురస్కారం

పెనగలూరు : శ్రీహరికోటలో శాస్త్రవేత్తగా విధులు నిర్వర్తిస్తున్న పెనగలూరుకు చెందిన గోపీకృష్ణ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ తెలుగు సంస్కృత అకాడమీ ప్రకటించిన ఉగాది పురస్కారాలలో విద్య, శాస్త్ర సాంకేతిక రంగం కేటగిరిలో ఆయన్ను ఎంపిక చేశారు. శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం(షార్)లో ఎంఎస్‌ఏ గ్రూపు డైరెక్టర్‌గా ఆయన పనిచేస్తున్నారు. మంగళవారం గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును అందుకోనున్నట్టు ఆయన మిత్రులు తండ్రి పేర్కొన్నారు. శ్రీహరికోటలో జరిగే రాకెట్ ప్రయోగాలు, వివిధ కార్యక్రమాలకు సంబంధించి మీడియా సమన్వయకర్తగా గోపీకృష్ణ పనిచేస్తున్నారు. ఆయన ఉగాది పురస్కారానికి ఎంపిక కావడం పట్ల క్లాస్‌మేట్స్‌తోపాటు పెనగలూరు ప్రజలు ఆయన్ను అభినందించారు.

కాలనీల పరిశీలన

నందలూరు(ఒంటిమిట్ట) : నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన సీసీ రోడ్లను నిర్మించేందుకు ఆ ప్రాంతాల్లో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి నందలూరు మండల ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి అడ్డుగా ఉన్న ఇళ్ల మెటికెలను తొలగించవలసిందిగా అధికారులకు ఎంపీపీ సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సూర్యనారాయణ, కాంట్రాక్టర్స్, సిబ్బందికి తగు సూచలను చేశారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు ప్రధాన కార్యదర్శి అమీర్, పంచాయతీ రాజ్ ఇంజనీర్ రవికుమార్, ఏఈ నవీన్, మండల కో- ఆప్షన్ సభ్యుడు కలీమ్ ఖాన్, శేషారెడ్డి, కుమ్మరపల్లి ప్రసాద్, గుణాయాదవ్ పాల్గొన్నారు.

గృహ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



గొర్లముదివీడులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ఒంటిమిట్ట : మలేరియా దోమలు ప్రభలకుండా ఉండాలంటే మనం నివాసం ఉండే గృహ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఒంటిమిట్ట మండల వైద్యాధికారి డాక్టర్ శ్వేత తెలిపారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా డాక్టర్ శ్వేత ఆధ్వర్యంలో మలేరియాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేస్తూ ఒంటిమిట్ట పురవీధుల్లో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నందలూరులో..

నందలూరు(ఒంటిమిట్ట): ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని మండల వైద్యాధికారి డాక్టర్ సృజన నేతృత్వంలో మంగళవారం మండల వైద్య శాఖ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సృజన మాట్లాడుతూ దోమల నియంత్రణ ద్వారా మలేరియాని సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్‌ఓ నారాయణ, సూపర్ వైజర్స్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

మలేరియాను నిర్మూలించాలి

సంబేపల్లె : మలేరియా నిర్మూలించాలని సంబేపల్లె వైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ర్యాలీ నిర్వహించారు. గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలేరియా నిర్మూలించడంపై సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించారు.

పుల్లంపేటలో..

పుల్లంపేట : పుల్లంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సానేశేఖర్, డాక్టర్ మనోజ్ చంద్రల ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజ, ఎస్ఎస్ దాస్, సుబ్రమణ్యం, సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోనంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ రఫీ ఉల్లాఖాన్, డాక్టర్ సిద్దయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి వై ప్రసాద్ యాదవ్‌లు పేర్కొన్నారు. దేవలంపల్లి, కోనంపేట పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికారులు, సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి, వైద్యాధికారులు మాట్లాడుతూ మలేరియా జ్వరం ఆడ అనాఫిలీస్ దోమలు ద్వారా ఒకరి నుంచి మరొక్కరికి ప్లాస్మోడియం పరన్న జీవికి చెందిన రెండు రకాల క్రిములు వైవాక్స్ (పీవీ), పీఎఫ్ 9పాల్సీ) మనదేశంలో వస్తున్నాయన్నారు. మలేరియా జ్వరం లక్షణాలు చలి, జ్వరం విపరీతంగా ఉండి చమటలు, తలనొప్పి రోజు విడిచి రోజు జ్వరం, ఒళ్లునొప్పులు ఉన్నట్లైతే వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు పి.రఫీవుల్లాఖాన్, బి సిద్దయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.ప్రసాద్ యాదవ్, ఆరోగ్య అధికారులు దేవదానం, రవీంద్ర, సురేంద్రరెడ్డి, మణి, వైద్య సిబ్బంది, సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దోమలబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

రాయచోటి అర్బన్ : ప్రతి ఒక్కరూ దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సర్వేలెన్స్ అధికారి రియాజ్‌బేగ్ సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గొర్లముదివీడు హైస్కూల్ విద్యార్థులు గ్రామంలో ప్రజాచైతన్య ర్యాలీని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ చుట్టుపక్కల ఉన్నవారికి దోమల బారిన పడకుండా తీసుకోవాలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలన్నారు.